అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
శుక్రవారం 11 అక్టోబర్ 2024 పేజీలు : 04

# సత్యసాయి ప్రియ భక్తుడు రతన్ టాటా...

-ప్రశాంతి నిలయంతో ఆత్మీయ అనుబంధం
-రతన్ టాటా జ్ఞాపకాలలో పుట్టపర్తి ప్రత్యేకం





పలు సందర్భాల్లో భగవాన్ సత్యసాయి బాబాతో రతన్ టాటా

**పుట్టపర్తి (కలెక్టరేట్), అక్టోబర్ 10, ప్రభాతవార్త**

ప్రముఖ పారిశ్రామిక దిగ్గజం, పద్మవిభూషణ్ రతన్ టాటాకు ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తితో ఆత్మీయ అనుబంధం ఉంది. రతన్‌టాటా భగవాన్ సత్యసాయి బాబాకు ప్రియ భక్తుడని చెప్పవచ్చు. ఆయన లక్షల కోట్లకు అధిపతి అయినప్పటికీ భగవాన్ సత్యసాయి ముందు సామాన్యభక్తుడిగా వ్యవహరించేవారు. స్వామి దర్శనం కోసం గంటల తరబడి ప్రశాంతి నిలయంలో తోటి భక్తులతో పాటు అత్యంత సాదాసీదాగా నేలపై కూర్చొని వేచి ఉండడం, మోకాళ్లపై కూర్చొని బాబా పాదాలకు నమస్కరించేవారు. పుట్టపర్తికి వచ్చిన ప్రతిసారి సమయం దొరికినప్పుడల్లా భక్తి పారవశ్యంలో మునిగిపోయేవారు. అంతేకాకుండా బాబా వారి జన్మదినోత్సవాలను కళ్ళారి చూసి తరించడమేకాకుండా అన్న ప్రసాదాల వితరణ కార్యక్రమాన్ని దగ్గరుండి చూసుకునేవారు. పదిరోజులకు ముందే ప్రశాంతి నిలయం చేరుకొని ట్రస్ట్ వారిని సమన్వయం చేసుకొని అన్నప్రసాద వితరణకు అవసరమైన ఏర్పాట్లలో లీనమయ్యే వారు. భక్తులకు ప్రశాంతి నిలయం బయట అన్నదానం చేయడంతో పాటు, సాయిదర్శనానికి రాలేని వృద్ధులు, భక్తుల కుటుంబాలను ఆయనే స్వయంగా అన్నప్రసాదాలను పార్శిల్ చేయించి పంపేవారని భక్తులు పేర్కొంటున్నారు. ఇలా సత్యసాయి సేవలో తరించడమంటే రతన్ టాటాకు ఎంతో ఇష్టమని సత్యసాయి భక్తులతో పాటు పుట్టపర్తి ప్రజానీకం ఆ మహనీయుని జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటున్నారు. బాబా తన సేవా సంస్థల్లో అతి కొద్ది మందికి మాత్రమే సేవలు అందించే భాగ్యాన్ని బాబా ప్రసాదించేవారు. అలాంటి వారిలో రతన్‌టాటా ఒకరు. ఆయన 2010వ సంవత్సరంలో భగవాన్ సత్యసాయి బాబా పుట్టిన రోజు పండుగ సందర్భంగా శ్రీసత్యసాయి విద్యావాహినిని రూ.144కోట్లతో ప్రారంభించారు. కోవిడ్ సమయంలో కూడా రూ.1500 కోట్లతో కరోనా వ్యాక్సిన్‌కొరకు వెచ్చించడం, రూ.6 వేల కోట్ల ఆస్తిని భారత దేశ ప్రజలకు అంకితం చేస్తానని ప్రకటించడం ఆయన మహోన్నత వ్యక్తిత్వానికి నిదర్శనం. ప్రపంచంలో ఎన్నో దేశాలు తిరిగినా, పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో దొరికే మానసిక ప్రశాంతత మరెక్కడా తనకు లభించలేదని స్వయంగా రతన్‌టాటా చెప్పేవారని పలువురు భక్తులు పేర్కొంటున్నారు. తన వ్యాపారంలో వచ్చే లాభాలలో 66 శాతం వరకు సామాజిక సేవా కార్యక్రమాలకు వెచ్చించి రతన్‌టాటా లక్షలాదికుటుంబాల్లో వెలుగులు నింపారని, అంతగొప్ప దాన గుణం ఆయనకు అలవడడానికి శ్రీసత్యసాయి బోధనలే ముఖ్యకారణమని భక్తులు చర్చించుకుంటుండడం విశేషం.

# అధికార మంద..! మద్యం దందా..!

- మద్యం దరఖాస్తుదారులపై అధికార పార్టీ నేతల ఆగడాలు



బాలిరెడ్డి ఇంటి వద్ద తెదేపా శ్రేణుల హంగామా

- ఎస్పీ జోక్యంతో ఆగిన ఎంపీటీసీ సభ్యుని అపహరణ



బాధితులతో వివరాలు తెలుసుకుంటున్న సీఐ ఈరన్న

**యాడికి(తాడిపత్రి), అక్టోబరు 10, ప్రభాతవార్త**

అధికారం మాదే..మద్యం మాదే..మధ్యలో మీరెవరంటూ మద్యం టెండర్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నవారిపై యాడికి మండల తెదేపా నాయకులు గురువారం జులుం ప్రదర్శించారు. వందలాది మంది తెదేపా నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చి యాడికిలో పెద్ద ఎత్తున హంగామా సృష్టించారు. నలుగురు రౌడీషీటర్ల బృందం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున తెదేపా శ్రేణులు తరలివచ్చి యాడికి పట్టణంలో గంటసేపు భయాందోళనలు సృష్టించారు. మద్యం టెండర్లకు 4 దరఖాస్తులు వేసిన యాడికి-2 ఎంపీటీసీ సభ్యుడు రామమోహన్‌ను పని చేస్తున్న చోట నుంచి తెదేపా నాయకులు తమ వాహనంలో ఎక్కించుకొని యాడికి పట్టణ సరిహద్దులకు తీసుకొని పోయి బెదిరింపులకు బరితెగించారు. డీడీలు వెనక్కు ఇవ్వాలని, అపహరణ విషయం తెలుసుకొన్న సీఐ, ఏఎస్సై, కానిస్టేబుల్‌లు ఫోన్ చేస్తుంటే సమాధానం ఇవ్వవద్దని బెదిరింపులకు పాల్పడ్డారని బాధితుడు రామమోహన్ వాపోయాడు. అలాగే మరో దరఖాస్తు వేసిన ఉపసర్పంచి కాసా చ ంద్రమోహన్ ఇంటి వద్దకు పెద్ద ఎత్తున చేరుకొని ఇంటిలోనే ఉన్నాడనే అపోహతో తలుపులు బద్దలు కొట్టే ప్రయత్నం చేశారు. మరో దరఖాస్తు వేసిన బాలిరెడ్డి ఇంటి వద్దకు వాహనాలతో సినిమాను తలపించేలా జనం తరలిరావడంతో యాడికి పట్టణ ప్రజలు ఇదేమి చోద్యమని ముక్కున వేలేసుకున్నారు. అతను ఇంటి వద్ద లేకపోవడంతో వెనుదిరిగి వెళ్లారు. ఈ విషయాలన్నీ జరుగుతున్నా పోలీసులు చోద్యం చూస్తుండటంతో ఎంపీపీ ఉమాదేవి నేరుగా ఎస్పీ జగదీష్‌తో ఫోన్‌లో జరుగుతున్న సంఘటనలు వివరిస్తూ ఫిర్యాదు చేశారు.ఎస్పీ ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవడంతో పోలీసుల్లో కదలిక వచ్చి అపహరణకు గురైన రామమోహన్ విషయంపై ఆరా తీశారు. పోలీసుల జోక్యం పెరిగిందని తెలుసుకున్న తెదేపా నాయకులు రామమోహన్‌ను జేసీడీఆర్ కళాశాల వద్ద వదిలేసి వెళ్లిపోయారు. అనంతరం



తెదేపా నాయకుల అపహరణకు గురెన్ఐ ఎంపీటీసీ సభ్యుడు రామమోహన్



తెదేపా నాయకుల దాడి నుంచి తప్పించుకున్న యాడికి ఉపసర్పంచి కాసా చంద్రమోహన్

వైకాపా కన్వీనరు బొంబాయి రమేష్ నాయుడు ఇంటి వద్దకు చేరుకున్న కాసా చంద్రమోహన్, రామమోహన్‌లను సీఐ ఈరన్న కలిసి వివరాలు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా తెదేపా నాయకుల తీరుపై ఎంపీపీ ఉమాదేవి తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. ఇదేమి ప్రజాస్వామ్యమని, ప్రభుత్వం నిర్వహించే వేలంపాటలో పాల్గొనే స్వేచ్ఛ కూడా లేదా అంటూ ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. బొంబాయి రమేష్ నాయుడును సంప్రదించిన తర్వాత బాధ్యులపై ఫిర్యాదు చేస్తామని బాధితులు తెలిపారు. ఈ సంఘటన నియోజకవర్గ వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# పల్లె పండుగ వారోత్సవాలను విజయవంతం చేయండి

- జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్

**శ్రీసత్యసాయిజిల్లా, అక్టోబర్ 10, ప్రభాతవార్త ప్రతినిధి:**

ఈ నెల 14వ తేది నుండి 20వ తేది వరకు శ్రీసత్యసాయిజిల్లాలో పల్లె పండుగ వారోత్సవాలను అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని కోర్టు హాలు నందు ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డ్వామా పిడి, డిపిఒ, పంచాయతీ రాజ్, గ్రామీణ,నీటి సరఫర, ఎంపిడిఓలు, పంచాయతీ కార్యదర్శులు, ఎపిఓలు, పంచాయతీరాజ్, గ్రామీణ నీటిసరఫరా శాఖల ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల సందర్భంగా ఈ సంవత్సరంలో చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని, గ్రామీణ నీటిసరఫర, పంచాయతీ రాజ్‌శాఖల ద్వారా 100% పనులు పూర్తీ చేయాలన్నారు. పల్లె పండుగ కార్యక్రమానికి రెండు రోజుల ముందుగానే కార్యదర్శులు టాంటాం వేయించాలని, పంచాయతీ పరిధిలో జరిగే భూమిపూజ వంటి కార్యక్రమాల వివరాలు ముందుగా అందించాలని, మంజూరైన పనుల గ్రామ గ్రౌండింగ్‌కు సంబంధించి పూర్తీ అవగాహన కలిగి ఉండాలన్నారు. చేపట్టబోయే పనులకు సంబంధించిన పూర్తీ వివరాలనుప్రజలకు తెలియజేసే బోర్డులు ఏర్పాటు చేయాలని, ఎస్‌సి, ఎస్‌టి కాలనీల్లో సిసి రోడ్లు, స్మశాన వాటికలను గుర్తించి వాటికి జిల్లా కలెక్టర్ నిధులను మంజూరుచేయడం జరుగుతుందన్నారు. 32 మండలాలు, 436 గ్రామ పంచాయతీలలో డ్వామా ఆధ్వర్యంలో 1152 పనులకు రూ.78 కోట్లు ఖర్చు చేస్తున్నామని, డిపిఓ ఆధ్వర్యంలో కొన్ని అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం జరిగుతుందన్నారు. భూమిపూజకోసం ప్రతిపాదించబడి, మంజూరుచేయబడిన పనుల ను పిఆర్ ఒన్ యాప్ ద్వాఆర అప్‌లోడ్ చేయబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఓ సమత, డ్వామా పిడి విజయేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# రూఫ్‌టాప్ వాటర్ హార్వెస్టింగ్ పనుల్లో రాష్ట్రంలోనే జిల్లా అగ్రస్థానంలో కొనసాగుతోంది



**అనంతపురం కలెక్టరేట్, అక్టోబర్ 10 ప్రభాతవార్త**

ప్రతి ఒక్క వర్షపు బొట్టుని నిల్వ చేసుకునేటట్లు చూడాలని భారత ప్రభుత్వం జలశక్తి జలవనరులశాఖ రాష్ట్ర జలవనరుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శంభునాథ్‌గుప్తా తెలిపారు. గురువారం ఢిల్లీలో నుండి 8 రాష్ట్రాల జిల్లా కలెక్టర్లతో భారత ప్రభుత్వం జలశక్తి జలవనరులశాఖ అడిషనల్ సెక్రటరీ, మిషన్ డైరెక్టర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జల్‌శక్తి అభియాన్‌తో పాటు జైసంచయ్ జన్ భగీదారి అమలు చేయాలని కలెక్టర్లకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అనంతపురం క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జల్‌శక్తి అభియాన్‌తో పాటు జైసంచయ్‌జన్ భగీదారి అమలు చేసేందుకు పూర్తిస్థాయిలో సంసిద్దంగా వున్నామని కలెక్టర్ అన్నారు. జలశక్తి మిషన్ సంబంధించి పనులపై సంబంధితశాఖ ఫారెస్ట్, వాటర్షెడ్, హార్టికల్చర్, అర్బన్ మున్సిపాలిటీ, ఆర్‌డబ్ల్యుఎస్ అయినటువంటి సమీక్ష నిర్వహించారు. కరువు పీడిత జిల్లా కాబట్టి ఈ ఆర్థిక సంవత్సరానికి 7 లక్షల మొక్కలు నాటడం జరిగిందన్నారు. అమృత్ సరోవర్ 75 శాతం పనులను పూర్తి చేయడం జరిగిందన్నారు. ఉపాధి హామీ పనుల్లో భాగంగా జిల్లాలో దేవాలయాల వద్ద వున్న కోనేరుల్లో పూడికతీత, పునరుద్దరణ పనులు, చెక్‌డ్యాం, రెయిన్‌వాటర్, జలాశయ రీచార్జ్, తదితర లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకునే విధంగా చూడాలన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని పరిరక్షించే విధంగా చూడాలని జిల్లాలో నీటి అవసరాలు, నిలువలు, వినియోగం తదితర విషయాలపై ప్రజలకు పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలియచేశారు. ఈ సమావేశంలో డిఎఫ్ఒ వినీత్‌కుమార్, ఎస్ఇ శ్రీరామ్, డ్వామా సలీంబాష, సూపరింటెండెంట్ శైలజ, ఆర్‌డబ్ల్యుఎస్, తదితర అధికారులు పాల్గొన్నారు.




# చేతులెత్తి మొక్కుతా ... మన పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరించండి....

- మున్సిపల్ చైర్మెన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి



మున్సిపల్ చైర్మెన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి

**తాడిపత్రి టౌన్, అక్టోబర్ 10 ప్రభాతవార్త:**

జిల్లాలో ఎక్కువ పరిశ్రమలు మన పట్టణంలో ఉండడం మన అదృష్టం.. అయితే పరిశ్రమలలలో వెలువడే వ్యర్థాలు ఇష్టారాజ్యంగా రోడ్ల పక్కన, నివాసా లకు సమీపంలో పడేయడం బాధాకరం.. ప్రజలకు చేతు లెత్తి మొక్కుతున్నా వ్యర్థాలు నిర్ణీత ప్రదేశాలలో వేయండి.. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకుందాం.. అందరూ ఆరోగ్యంగా జీవిద్దాం అని మున్సిపల్ ఛైర్మెన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గుజారి దుకాణాల నిర్వాహకులు, ఫంక్షన్ హాల్‌ల నిర్వాహకులతో ప్రత్యేక మావేశం ఏర్పాటు చేశారు. పట్టణ పారిశుద్ధ్యం కోసం వారూ తీసుకోవాల్సిన చర్యలపై తగు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ తాడిపత్రి పట్టణం నలువైపులా శివారు ప్రాంతాల్లో ఎక్కడ చూసినా వ్యర్థాలతో నిండిపోయిందన్నారు. దీనిని అలాగే వదిలేస్తే భవిష్యత్తులో మరింత ఇబ్బందికరంగా, మురికిగా మారుతుందన్నారు. అందుకే శివారు ప్రాంతాల్లో ఎక్కడే కానీ వ్యర్థాలు ఉండకూడదన్నారు. ప్రధానంగా పుట్లూరు రోడ్డు, కడప రోడ్డు, చుక్కలూర్ రోడ్డులో వ్యర్థాలు అధికంగా కనిపిస్తున్నాయన్నారు. గ్రానైట్ పరిశ్రమల యజమానులు తమ ఫ్యాక్టరీల్లో వ్యర్థాలను తీసుకొచ్చి ఎక్కడబడితే అక్కడ రోడ్డు దగ్గర్లో వేసి వెళ్తున్నారన్నారు. గురువారం నుండి ఇలాంటి వాటికి స్వస్థి పలకల్సిందేనన్నారు. నలువైపులా వ్యర్థాలను రవాణా చేసే వాహనాలను గుర్తించేందుకు అధునాతనమైన టెక్నాలజీతో కూడిన చిప్పు సిస్థంతో కూడిన సిసి కెమరాలు అమరుస్తున్నామన్నారు. దయచేసి వ్యర్థాలను తోలే ట్రాక్టర్లు ఇతర వాహనాలు పట్టుబడితే వాటిని విడిపించాలని ఎవరేగానీ తన వద్ద సిఫార్సు తీసుకురావద్దని ఖరాఖండిగా తెలిపారు. వ్యర్థాలు తోలే ట్రాక్టర్లు, ఇతర వాహనాలు పట్టుబడితే ఇక జీవితంలో వాటిని విడిపించుకోలేరని కఠినంగా హెచ్చరించారు. ఇటీవల కాలంలో తాడిపత్రి పట్టణంలో అండర్ డ్రైనేజీ వ్యవస్థ పాడైపోయి కాలువలు పూడి పోయాయన్నారు. ఖాళీగా ఉన్న స్థలాల్లో పెరిగిన కంపచెటన్లను ఆయా స్థలాల యజమానులు వెంటనే తొలగించుకోవాల్సిందిగా ఆదేశించారు. దీనికి రెండు నెలలో తొలగించని పక్షంలో మున్సిపాలిటి తరుపఉన కంప చెట్లను తొలగించచి ఆ స్థలం మరొకరి రిజిస్టర్ కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని గాని, ఇబ్బంది పెట్టాలని గాని తన చర్యలఉ ఉండడం లేదన్నారు. కేవలం తాడిపత్రి పట్టణ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని కొంత కఠినంగా వ్యవహరించాల్సి వస్తోందని స్పష్టం చేశారు. ప్రజల సహకారం లేకుండా అభివృద్ధి సాధ్యం కాదనే విషయాన్ని అందరూ గుర్తించాలని అన్నారు.








గుంతకల్లు నియోజకవర్గం పామిడి మండలం గజరాంపల్లిలో ఉన్న వ్యాలీ గ్రీన్ గార్మెంట్ ఇండస్ట్రీలో గురువారం పారిశ్రామిక వేత్త రతన్ టాటా మృతి పట్ల టిడిపి సీనియర్‌నేత పారిశ్రామిక వేత్త పెరుమాళ్ళ జీవానందరెడ్డి ఇతర సంస్థల ఉద్యోగులు ప్రత్యేకంగా రతన్ టాటా చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా పెరుమాళ్ళ జీవానందరెడ్డి మాట్లాడుతూ విలువలు, మానవత్వంతో కూడిన వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించిన మహా దార్శనికుడు రతన్ టాటా అన్నారు. దేశాభివృద్ధి, ప్రజా శ్రేయస్సు, ఉద్యోగుల సంక్షేమమే పరమావధిగా టాటా గ్రూప్ సంస్థలను దశాబ్దాలుగా అదే నిబద్ధతతో నిర్వహించిన పద్మవిభూషన్ రతన్ టాటా సేవలు చిరస్మరణీయం అన్నారు. మన దేశంలో ఏ మూల ఏ విపత్తు సంభవించినా భారీ విరాళంతో స్పందించే మానవత్వపు హృదయం అన్నారు.

02ATP27_02ATP27.qxd 10-10-2024 PM 10:33 Page 1



## డిపో సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు ఎన్ఎంయు వినతి

**రాయదుర్గం, అక్టోబర్ 10 ప్రభాతవార్త:**


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న ఎన్ఎంయు నాయకులు

పట్టణంలోని ఆర్టీసి డిపోలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనిటి అసోసియేషన్ నాయకులు గురువారం స్థానిక ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులకు వినతి పత్రం అందించారు. గురువారం నూతన బస్సులను ప్రారంభించడానికి వచ్చిన ఆయనకు వారు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ముందుగా ఎన్ఎంయూ నాయకులు ఎమ్మెల్యేకు పుష్పగుచ్చం అందించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బస్టాండ్ భవనము పై కప్పు పెచ్చులు పడుతున్నాయని, నూతన భవనం ఏర్పాటు చేయాలని, లేదా బస్టాండ్‌కు మరమ్మత్తులు చేయించాలని కోరారు. బస్సు సర్వీసులను పునరుద్దరించి ఉపాధి కల్పించాలని తదితర సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. సమస్యలను విన్న ఎమ్మెల్యే స్పందిస్తూ ఉన్నతాధికారులతో మాట్లాడి మీ సమస్యలు పరిష్కారమ్యే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసిస్టెంట్ సెక్రెటరి ఎస్.నాగరాజు, జోనల్ ఉపాధ్యక్షుడు ఎంఎండి షఫి, రిజనల్ ఆర్గనైజింగ్ సెక్రటరి రవినాయక్, రిజనల్ ఉపాధ్యక్షుడు దామోదర్, డిపో సెక్రెటరి హెచ్.తిప్పేస్వామి, డిపో ప్రెసిడెంట్ జిలాన్, సిసిఎస్ డెలిగేట్ ఈ.నాగరాజు, గ్యారేజ్ అధ్యక్ష కార్యదర్శులు దూద్‌పీరా, సతీష్‌కుమార్, సినియర్ నాయకులు బాలాజీనాయక్, సత్తార్‌ఖాన్, రామాంజినేయులు, యుఎల్ నారాయణ, ఈశ్వర్‌రెడ్డి, షబ్బీర్, సతీష్, బషీర్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## భైరవానితిప్పలో రోడ్డుకు మట్టితోలిస్తున్న సర్పంచ్ శెట్టిగారి మంజునాథ

**బ్రహ్మసముద్రం అక్టోబర్ 10 ప్రభాతవార్త,**


మట్టిని తోలిస్తున్న సర్పంచ్

మండంలోని భైరవానితిప్ప గ్రామంలో రోడ్డు వర్షాల కారణంగా గుంతలు పడినచోట గురువారం సర్పంచ్ శెట్టిగారి మంజునాథ రోడ్డుకు ట్రాక్టర్‌తో మట్టిని తరలించి గుంతలను పూడ్చారు. గ్రామాలలో గుంతలలో మురుగు నీరు నిలిచి సీజనల్ వ్యాధులు ప్రభలకుండా గుంతలకు మట్టిని వేయడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## ఎంపిడీఓగా భాధ్యతలు చేపట్టిన నందకిశోర్

**బ్రహ్మసముద్రం అక్టోబర్ 10 ప్రభాతవార్త,**


ఎంపిడీఓ నందకిశోర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

మండల ఎంపిడీఓగా నందకిశోర్ గురువారం భాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపిడీఓ దాసా నాయక్ బదిలీపై డి హిరేహాళ్‌కు బదిలీపై వెళ్ళడంతో ఎంపిడీఓ కార్యాలయంలో ఏఓగా విధులు నిర్వహిస్తున్న నందకిశోర్‌కు అదనపు భాధ్యతలుగా ఎంపిడీఓగా నియమితులైయ్యారు ఎంపిడీఓగా భాధ్యతలు చేపట్టిన నందకిశోర్‌కుకు కార్యాలయ సిబ్బంది పూలమాలతో సన్మానించారు.

## జిల్లా పంచాయితీరాజ్ అధికారిని సన్మానించిన తెదేపా నాయకులు

**బ్రహ్మసముద్రం అక్టోబర్ 10 ప్రభాతవార్త,**


సన్మానిస్తున్న దృశ్యం

జిల్లా పంచాయితీరాజ్ అధికారి నాగరాజునాయుడు, కళ్యాణదుర్గం డియల్‌పిఓ వెంకటేనాయుడును మండలక న్వినర్ పాలబండ్ల శ్రీరాములు, సర్పంచ్ మల్లికార్జున, కంబదూర్ సురేంద్ర,మాజి ఎంపిపి మంజుళ వన్నూరుస్వామి,నాయకులు డాబా నాగరాజు,తిప్పేస్వామి,హనుమంతు కళ్యాణదుర్గంలోని ప్రజావేదికదగ్గర వారికి పూలమాల శాలువాతో సత్కరించారు వారిఅందించిన సేవలను మరువలేనివని అన్నారు.

## కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎంపిపి తలారి రంగయ్య

**శెట్టూరు, అక్టోబర్ 10 ప్రభాతవార్త**


బాధిత కుటుంబాలకు చెక్కును అందజేస్తున్న మాజీ ఎంపి తలారి రంగయ్య

మండల పరిధిలో ఎర్రబోశేపల్లి గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త హరిజన మహేష్ గత నెలలో టిడిపి నాయకులు దాడిలో గాయంపడటంతో విషయాన్ని తెలుసుకున్న మాజీ పార్లమెంట్ సభ్యులు కళ్యాణదుర్గం నియోజకవర్గం సమన్వయ కర్త డా.తలారి రంగయ్య స్థానిక పార్టీ శ్రేణులతో కలిసి వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి 50 వేల రూపాయలు చెక్కు అందజేశారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు కూడా కార్యకర్తలకి నాయకులకు అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస ఆర్‌సిపి రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, జడ్పిటిసి మంజునాథ్ సోమనాథరెడ్డి ఎమ్మెస్ రాయుడు బోయ తిప్పేస్వామి, వెంకటరమణ, రామ్‌రెడ్డి, రాజ్‌కుమార్, మల్లేష్, విజయ్‌కుమార్, వన్నూరుస్వామి, పార్టీ నేతలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కాలవ జన్మదినంకు భారీ కేక్‌కటింగ్...

**రాయదుర్గం, అక్టోబర్ 10 ప్రభాతవార్త:**



తమ ప్రియతమ నాయకుడు, వాల్మీకి ముద్దుబిడ్డ, నీరుపేదల ఆశాజ్యోతి అయిన రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు జన్మదినం సందర్భంగా సెంప్ర (శనివారం) నియోజకవర్గంలోని బొమ్మనహాళ్ మండలంలోని దర్గాహోన్నూరు టిడిపి సీనియర్ నాయకుడు, బిసిసెల్ అధ్యక్షులు, టిడిపి మాజీ సర్పంచ్ వై.కేశన్న ఆధ్వర్యంలో 60కేజీల భారీ కేక్‌ను కట్‌చేస్తున్నట్లు తెదేపా మాజీ సర్పంచ్ వై. కేశన్న గురువారం ఒ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని పట్టణంలోని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. కావున ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ నాయకులు, అభిమానులు, టిడిపి కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## సిద్దరూడ శివలింగ స్వామికి ప్రత్యేక పూజలు

**డి.హీరేహాళ్, అక్టోబర్ 10 ప్రభాతవార్త:**


భక్తులకు అన్నసంతర్పణ చేయిస్తున్న నాగల్లి రాజు

సిద్దరూడ శివలింగ స్వామి ఆలయంలో ఆ ఆలయ కమిటి చైర్మెన్ నాగళ్ళి రాజు ఆధ్వర్యంలో శరన్నవ రాత్రి పూజలు ఘనంగా నిర్వహించారు. గురువారం డి.హీరేహాళ్ మండల కేంద్రంలోని జాతీయ రహదారి సమీపంలో వెలసిన శివలింగస్వామి ఆలయంలో దేవి శరన్నవ రాత్రుల ప్రత్యేక పూజలతో పాటు దేవి పురాణం వైభవంగా సాగుతోంది. ఆ ఆలయ కమిటి సభ్యులు ఆధ్వర్యంలో శరన్నవరాత్రుల ప్రారంభం నుంచి ప్రతి రోజు ఆలయ ప్రాంగణంలో అమ్మవారి పారాయణం తోపాటు శివలింగస్వామి పురాణం భక్తులకు వినిపిస్తున్నారు. నవరాత్రుల్లో భాగంగా వేకువ జాము నుంచి స్వామివారికి పూజలు నిర్వహిస్తూ వివిధ రకాల పారాయణాలు పట్టిస్తూ భక్తులకు పురాణ గాథలు చదివి వినిపిస్తూ అవగాహన కల్పిస్తున్నారు. అనంతరం పుష్పాబిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి పూజ అనంతరం అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందిస్తూ, నాగల్లి సతీమణి ఎన్.పుష్పావతితో పాటు కమిటి సభ్యులు శ్రీరాములు, వీరలింగ తిప్పేస్వామి, కనిగిరి వన్నూరుస్వామి, విజయ్, వెంకటేష్, దేవేంద్ర, సూరి, భక్తులు పాల్గొన్నారు.

## దుర్గాదేవి అలంకరణలో పద్మావతి అమ్మవారు

**బెలుగుప్ప, అక్టోబర్ 10 ప్రభాతవార్త**



మండల పరిధిలో బూదిగుమ్మ రామసాగ్రంలో పద్మావతి దేవి విగ్రహానికి దుర్గాదేవి అలంకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తాదులు అధిక సంఖ్యలో విచ్చేశారు. వచ్చిన భక్తాదులకు ఆలయ అర్చకులు వాసు తీర్థప్రసాదాలు అందజేశారు.

## తాండాలో దుర్గాదేవికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు

**బెలుగుప్ప, అక్టోబర్ 10 ప్రభాతవార్త**


దుర్గా దేవిని దర్శించుకుంటున్న భక్తులు



మండల పరిధి లోని తాండాలో నూతనంగా నిర్మించిన దుర్గాదేవి ఆలయంలో బెలుగుప్ప తాండా భక్తాదులు, గ్రామ ఉద్యోగ సంఘాలు ఆధ్వర్యంలో దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకాలు నిర్వహించారు. శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. దుర్గాదేవి విగ్రహాన్ని ఆ గ్రామంలో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తాదులంతా దుర్గాదేవిఅమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం గణపతి, నవగ్రహ, దుర్గా వాస్తుహోమం, ఛండీ రుద్ర హోమం, భక్తులు, పూజారులు నిర్వహించారు. అందులో భాగంగా 11వ తేది కూడా ప్రత్యేకంగా అమ్మవారిని అలంకరించి, కళశం కూడా ఆలయంపై ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వచ్చిన భక్తాదులందరికీ తీర్థప్రసాదాలు అందజేశ్యారు. ఈ కార్యక్రమానికి ఈ తాండాలోకి బంధువులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జనసైనికుని కుటుంబానికి ఆర్థిక చేయూత

**గుత్తి, అక్టోబర్ 10 ప్రభాతవార్త**


ఆర్థిక సాయం అందచేస్తున్న దృశ్యంవ

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జనసేన పార్టీ కార్యకర్త ధనుంజయ కుటుంబానికి ఆ పార్టీ నేతలు అండగా నిలిచారు. గురువారం అతని కుటుంబానికి మానవతాదృక్పథంతో 50 వేల రూపాయల నగదును నియోజకర వర్గం కన్వీనర్ వాసగిరి మణికంఠ అందచేశారు. భవిష్యత్తులో పార్టీ అండగా వుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల కన్వీనర్లు పాటిల్ సురేష్‌రాయల్, చిన్న వెంకటేశులు, నాయకులు బ్రహ్మయ్య, నాగయ్య, హేమంత్, ధనుంజయ, నాగప్ప, రాజు, గోపాల్, అంజి, లారెన్స్, తదితరులు పాల్గొన్నారు.

## ఊది అలంకరణలో శ్రీషిరిడిసాయినాథుడు

**గుత్తి, అక్టోబర్ 10 ప్రభాతవార్త**



దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గురువారం స్థానిక శ్రీషిరిడిసాయిబాబా ఆలయంలో శ్రీసాయినాథున్ని ఊదితో ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం అభిషేకాలు, అర్చనలు, వ్రతం, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా శ్రీకన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారిని మహిషాసురమర్ధిగా అలంకరించారు. గౌతమేశ్వరాలయంలో, గుత్తి ఆర్ఎస్ అమ్మవారిశా, సేవాఘడ్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ప్రభుత్వం నిర్ణయించిన ధరకు పామాయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్ పంపిణీ

**గుత్తి, అక్టోబర్ 10 ప్రభాతవార్త**


ఆయిల్ ప్యాకెట్లను అందచేస్తున్న దృశ్యం

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గుత్తి పట్టణంలోని శ్రీబాలాజీ ట్రేడర్స్ హోల్‌సేల్ దుకాణంలో ప్రభుత్వం నిర్ణయించిన ధర మేరకు పామాయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్‌ను తహాశీల్దార్ ఓబులేసు చేతుల మీదుగా పంపిణీ చేశారు.. ఇందులో భాగంగా పామాయిల్ 118 రూపాయలు, సన్‌ఫ్లవర్ అయిల్ 127 రూపాయలకు విక్రయించారు. ఈ కార్యక్రమంలో సిఎస్‌డిటి సూర్యనారాయణ, విఆర్ఓ రంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## లింగాయతులను బిసిల్లో చేర్చండి

**హిందూపురం టౌన్, అక్టోబర్ 10 ప్రభాతవార్త**


ఎంపి అంబికా లక్ష్మీనారాయణకు పుష్పగుచ్చం అందచేస్తున్న వీరశైవలింగయత్ సభ్యులు

వీరశైవలింగాయతులను ఒబిసి జాబితాలో చేర్చాలని గురువారం హిందూపురం వీరశైవ లింగాయత్ సంఘం సభ్యులు అనంతపురం ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, హిందూపురం ఎంపి బికె పార్థసారధిలను కలిసి వినతిపత్రం అందచేశారు. ఎంపిలు స్పందిస్తూ లింగాయతుల సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని తెలిపారు. ఎంపిలను కలిసిన వారిలో వీరభద్రప్ప, నంజుండప్ప, తదితరులు వున్నారు.

## దుర్గాదేవి అలంకారంలో అమ్మవారు

**లేపాక్షి, అక్టోబర్ 10 ప్రభాతవార్త**



ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన లేపాక్షి శ్రీదుర్గా వీరభద్రస్వామి దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం దుర్గాదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి, వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి విశేషంగా అలంకరించారు. అనంతరం లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ రామానందన్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో ఆలయ ఇఒ నరసింహమూర్తి, రామానందన్ మిత్రులు, సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## మైనర్ కార్మికుల గుర్తింపుకై అపరేషన్ స్వేచ్ఛ

**-సిఐ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పర్యవేక్షణలో తనిఖీలు**

**గోరంట్ల, అక్టోబర్ 10 ప్రభాతవార్త**


వస్త్ర దుకాణాలు తనిఖీ చేస్తున్న దృశ్యం


పట్టుబడిన మైనర్ విద్యార్థులతో పోలీసులు

మైనర్ బాల కార్మికులుగా పనిచేస్తున్న పలు షాపులపై ఆపరేషన్ స్వేచ్ఛ పేరుతో గోరంట్ల సిఐ శేఖర్ జాయింట్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐతోపాటు ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నాగరాణి ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి పట్టణ వ్యాప్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటుకల తయారీ పరిశ్రమలు, కార్పెంటరీ షాపులు, కిరాణషాపులు, మెకానిక్ షాపులు, గుజిరీ షాపులను తనిఖీ నిర్వహించగా 14 మంది మైనర్లు పనిచేస్తున్నట్లు గుర్తించి వారిని స్టేషన్‌కు పిలిపించి వారి ఆధార్‌కార్డు ఆధారంగా వయసు చెక్ చేసి మైనర్ విద్యార్థులను కార్మికులుగా పెట్టుకోరాదని షాపుల యజమానులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## చింతవనంలో మట్టి.. అక్రమంగా రోడ్డు పనులకు

**- నేలకూలడానికి సిద్ధంగా ఉన్న వందేళ్ల నాటి చింతచెట్లు**

**- వైసిపి నాయకుడు చెప్పాడని కాంట్రాక్టర్ అత్యుత్సాహం**

**గోరంట్ల, అక్టోబర్ 10 ప్రభాతవార్త**


చింతవనంలో గుంతలు తవ్విన వైనం

తాను చేస్తున్న కాంట్రాక్ట్ పనులు తక్కువ ఖర్చుతో చేసి ఎక్కువ లాభం పొందాలన్నా అత్యాశతో 100 ఏళ్ల నాటి చింతవనంలో దాదాపు పది అడుగుల లోతు గుంతలు తవ్వి ఆ వందేళ్ల నాటి చెట్టు నేలకొరిగేలా అక్రమంగా అనుమతులు లేకుండా రోడ్డు పనులకు మట్టి తరలించాడు ఆ కాంట్రాక్టర్. ఈ సంఘటన మండలంలోని కమ్మవారిపల్లి పంచాయతీ పరిధిలోని సాగరాల ఆంజనేయస్వామి ఆలయం వద్ద పురాతన చింతవనంలో చోటుచేసుకుంది. చింతచెట్ల మధ్య లోతైన గుంతలు తవ్వి భారీగా మట్టిని తరలిస్తున్నారన్న సమాచారం మేరకు టిడిపి నేత పచ్చ అశోక్ సూచన మేరకు గురువారం సాయంత్రం గ్రామస్తులు, టిడిపి నాయకులు చంద్రారెడ్విడ, కమ్మ శ్రీరాములు అక్రమ మట్టి రవాణాను అడ్డుకున్నట్లు తెలిపారు. ఈ రవాణాపై కాంట్రాక్టర్‌ను ప్రశ్నిస్తే స్థానిక వైసిపి నాయకులతో మాట్లాడుకున్నానని సర్పంచు భర్తతో చర్చించానని అందుకే మట్టి తోలుకుంటున్నానని సమాధానం ఇచ్చినట్లు తెలిపారు. రోడ్డు పనులుచేస్తున్న కాంట్రాక్టర్ వైసిపి నాయకులతో కుమ్మక్కు కావడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. మట్టిని రవాణా చేయాలంటే సంబంధితశాఖతో అనుమతి తీసుకుని ఫీజు చెల్లించి రవాణా చేసుకోవాలని కానీ వైసిపి నాయకులతో కుమ్మక్కై చేసుకుంటే నష్టం ప్రభుత్వానికి కాదా అంటూ ప్రశ్నించారు.

## 14 మంది జూదరుల అరెస్ట్

**- రూ.1.3 లక్షలు స్వాధీనం**

**గోరంట్ల, అక్టోబర్ 10 ప్రభాతవార్త**

మండలంలోని పాలసముద్రం పంచాయతీ పరిధిలోని బిఎన్‌తాండా సమీపంలో గుట్టల వద్ద పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు గోరంట్ల పోలీసులు దాడులు నిర్వహించి 14 మందిని అదుపులోకి తీసుకుని వారివద్దనుండి 1 లక్ష 3 వేల 325 రూపాయలతో పాటు పది వాహానాలను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు సిఐ శేఖర్ తెలిపారు.

## చౌడేశ్వరీ అమ్మవారికి ప్రత్యేకపూజలు

**బుక్కపట్నం, అక్టోబర్ 10, ప్రభాతవార్త**


చౌడేశ్వరీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న సామకోటి ఆదినారాయణ

మండల కేంద్రమైన బుక్కపట్నంలోని చౌడేశ్వరీ దేవి అమ్మవారికి శ్రీసత్యసాయిజిల్లా తెదేపా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం అమ్మవారిని దర్శించుకొని ప్రజలందరూ ఆయురారోగ్యాలతోవర్ధిల్లాలని, సుఖశాంతులతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు ఆయన తెలియజేశారు.

## లింగ నిర్ధారణ పరీక్షలు చట్టవిరుద్ధం - ఆర్డీఒ శ్రీనివాస్


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఒ శ్రీనివాస్

**గుంతకల్లు, అక్టోబర్ 10 ప్రభాతవార్త**

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టవిరుద్ధమని అలాంటి పరీక్షలు చేసే కేంద్రాలపై చర్యలు తీసుకుంటామని ఆర్డీఒ శ్రీనివాస్ హెచ్చరించారు. గురువారం స్థానిక ఆర్డీఒ కార్యాలయంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ యుగంధర్ ఆధ్వర్యంలో సబ్ డివిజనల్ స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఒ మాట్లాడుతూ బ్రూణ హత్యలు ఆపడానికి, క్షీణిస్తున్న లింగ నిష్పత్తిని అరికట్టడానికి ప్రీ నేటల్ డయోగ్నొస్టిక్ చట్టం 1994 రూపొందించడం జరిగిందన్నారు. పరీక్షలు చేయడమే కాదు ప్రోత్సహించిన దంపతులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. "బేటీ బచావో - బేటీ పడావో" నినాదాన్ని ప్రోత్సహించాలన్నారు. డివిజన్ స్థాయిలో ఆర్ఎంపిలు, పిఎంపిలతో సమావేశాలు ఏర్పాటు చేసి పిసి, పిఎన్‌డిటి చట్టంపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రధానంగా జిల్లాలో లింగ నిష్పత్తి చాలా తక్కువగా వుందని నిష్పత్తిని అభివృద్ధి చేయడానికి అందరూ కలిసి కట్టుగా పనిచేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో గైనకాలజిస్ట్ సుజాత, చిన్నపిల్లల వైద్యనిపుణులు డాక్టర్ రామాంజినేయులు, రేడియోలజిస్ట్ డాక్టర్ మమత, డాక్టర్లు అరుణ, హరిత, రూరల్ సిఐ మహేశ్వర్‌రెడ్డి, ఆరోగ్య విద్యాబోధకులు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర కీలకం

**- శిక్షణా తరగతుల్లో ఎంపిడిఒ షకీలాబేగం**

**విడపనకల్లు, అక్టోబర్ 10 ప్రభాతవార్త**


శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న ఎంపిడిఒ

కూటమి ప్రభుత్వం రూపొందించిన రిఫ్రెషల్ కార్యక్రమంలో భాగంగా పంచాయతీ ఉపసర్పంచు, వార్డు సభ్యులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశం భవనంలో శిక్షణా తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా ఎంపిడిఒ షకీలాబేగం మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర కీలకమైందన్నారు. గ్రామాభివృద్ధి పరిపాలన నిర్వహణలో సర్పంచుకు మాత్రమే కాకుండా వార్డు మెంబర్లకు కూడా అధికారం వుంటుందన్నారు. ప్రతి నెలా కూడా పంచాయతీ కార్యాలయంలో సర్పంచు నేతృత్వంలో వార్డు మెంబర్లతో కలిసి గ్రామ సభ నిర్వహించాలన్నారు. గ్రామాల్లో మౌళిక సదుపాయాల కల్పనకు ఈ శిక్షణా తరగతులు దోహదపడతాయన్నారు. ప్రధానంగా గ్రామ, జిల్లా పరిషత్, మండల పరిషత్ నిధులు, హక్కుల గురించి వివరించారు. అలాగే పంచాయతీ ఆస్తుల పరిరణక్ష, ఆక్రమణల తొలగింపు, ప్రభుత్వ విధుల వినియోగం, తదితర 9 అంశాలకు సంబంధించి ఉపసర్పచు, ఇద్దరు మహిళలు, ఒక పురుషుడు, వార్డు సభ్యులకు శిక్షణ కల్పిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం ఆయా గ్రామాలకు అసరమైన సదుపాయాలపై కార్యాచరణ ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో మండల పరిషత్ పరిపాలన అధికారి భాస్కర్, విస్తరణాధికారి సత్యబాబు, ఉపాధిహామీ ఏపిఒ సంజీవ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడి కేంద్రంలో విజయదశమి వేడుకలు

**గుంతకల్లు, అక్టోబర్ 10 ప్రభాతవార్త**


పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

మండలంలోని శంకరబండ గ్రామం అంగన్‌వాడి కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రషావతి ఆధ్వర్యంలో గురువారం విజయదశమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భవతులు, బాలింతలతో కలిసి పూజలు నిర్వహించారు.

## ధ్వంసమైన రోడ్డుకు మరమ్మతులు

**గుత్తి, అక్టోబర్ 10 ప్రభాతవార్త**


రోడ్డు మరమ్మతు చేసిన దృశ్యం

గుత్తి - గుంతకల్లు నడుమ రజాపురం శివారులో వర్షాల దాటికి రోడ్డు ధ్వంసం కావడంతో గురువారం టిడిపి ఆధ్వర్యంలో మరమ్మతులు చేపట్టారు. గుత్తి ఇన్‌చార్జ్ గుమ్మనూరు నారాయణ పర్యవేక్షణలో గోతులకు గ్రావెల్ వేసి పూడ్చి వేశారు. దీంతో వాహనాల రాకపోకలకు మార్గం సుగమమైంది.

## ఎస్‌సి, ఎస్‌టిలపై దాడులు అరికట్టాలి

**గుంతకల్లు, అక్టోబర్ 10 ప్రభాతవార్త**


ఆర్డీఒకు పుష్పగుచ్చం అందచేస్తున్న దృశ్యం

ఎస్‌సి, ఎస్‌టిలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని గుంతకల్లు రెవెన్యూ డివిజన్ ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు గురువారం ఆర్డీఒ శ్రీనివాస్‌ను కలిసి విన్నవించారు. దాడులను అరికట్టడం తో పాటు అట్రాసిటీ కేసులకు త్వరగా పరిష్కారం చూపి న్యాయం చేయాలన్నారు. చాలా గ్రామాల్లో ఇప్పటికి అంటరానితనం, భూ సమస్యలు అధికంగా వున్నాయని వాటిని పరిష్కరించాలని కోరారు. ఆర్డీఒను కలిసిన వారిలో మానిటరింగ్ కమిటీ సభ్యులు పెద్దకౌకుంట్లకు చెందిన సి.రవి, గుంతకల్లుకు చెందిన డాక్టర్ హరిప్రసాద్‌యాదవ్, పందికుంటకు చెందిన కావలి మల్లికార్జున, గజరాంపల్లికి చెందిన సాకే గోవిందు, తదితరులు వున్నారు.

